కథానిక

# దారం ముక్క

తా సీ రా

ఆది సంతదినం. విజయనగరానికి వచ్చే రోడ్ల మీదబడి పరిసర పల్లెటూరు తక్కువపాటి రైతులు, కూలినాలి జనం, వాళ్ళ భార్యలూ, పిల్లలూ, టౌనులోకి త్వరగా చేరుకోవాలనే ప్రవృత్తిని, సంతలో కావాల్సిన వస్తువులు, సామాన్లు, పశువులు వగైరా కొనుక్కునేందుకు కాలంవుంటుందో లేదోననే కంగారును ముందుంచుకుని, నడక వేగం హెచ్చించి మరీ నడుస్తున్నారు. పొడుగాటివాళ్ళ వంకర కాళ్ళ సంచలనంలో దేహాలు ముందుకుపొంచుకువస్తున్నయ్; బహుశా ఎప్పుడూ నాగలి ఒకే భుజంమీద ఉండడంచేత, ఆ భుజం కుంగిపోయి, రెండోది కొంచెం పైగావున్నది, వాళ్ళల్లో ప్రతివాడికీ. నడకభారంలో, అలసట కారణంగా ప్రతివానికి నోటినుంచి మాటలు బయటికి పెకలిరావటం కష్టంగానే వున్నది. ఆలోచనలసలే బండబారినట్టున్నయ్. ఆడవాళ్ళు మొగవాళ్ళకు పక్కగా నడుస్తున్నారు.

కొందరు ఆవులను, దూడలను పట్టుకొనివస్తున్నారు. వాటిని వెనకాల, వారి భార్యలు తోలుతున్నారు. ఆకులతో నిబిడమైవున్న పెద్ద పెద్ద వృక్షాలు దర్ప స్ఫూర్తిగా తలలెత్తుకొని వున్నయ్ కొందరాడవాళ్ళు చేతుల్లో పొడుగాటి బుట్టలు వుంచుకొని, మోసుకువస్తున్నారు. ఆ బుట్టల కన్నాల్లోంచి కోళ్లు, బాతులతలలు కనబడుతున్నయ్. వాళ్లు మొగవాళ్ళకన్న కొంచెం వెనుకబడి నడుస్తున్నారు. దేహాలమీదవున్న చెమటలు తీక్షణమైన సూర్యకిరణాల తాకిడికి తట్టుకోనేందుకు పనికిరావటంలేదు. వాళ్ల జుట్టు గాలికి పైకిలేగి ఎర్రగా రాగికిమల్లే ఎండలో మెరుస్తూంది.

అపుడపుడు, ఏదో ఒకబండి వస్తూపోతున్నది. దానిలోవున్న ఒకరిద్దరు మొగవాళ్లు ఆడమనిషీని, బండి గతుకుల్లోపడ్డపుడల్లా, తల బండికికొట్టుకుని, భౌతికంగా జుగుప్సను, బాధను పొందుతున్నారు.

విజయనగరం సంతలో పశువులు, మనుషులు గుంపుగూడి కోలాహలం సృష్టిస్తున్నయ్. జనంలోంచి, పైగా దున్నపోతుల కొమ్ములు, మనుషుల శిరస్సులూ, కనబడుతున్నయ్. పెద్దపెట్టున వారు చేసే గింగురుమనే ధ్వనులమధ్య, వెకిలిగా, పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వులు బయటికి దూసుకువస్తున్నయ్. పక్కయింటిగోడ గుంజకు కట్టివేయబడ్డ ఆవు "అంబా"అని అరిచింది.

అంతటా పశువులే. చిల్లరమల్లర సరుకు దుకాణాలే. అక్కడ గొప్పవారు, ధనవంతులు గూడ వున్నారు, కాని ఎక్కువభాగం వున్నవార్లు పల్లెటూరు రైతులూ, కూలినాలీ జనం, అని వారి వేషభాషలవల్లే వ్యక్తమవుతూంది. విజయనగరంపక్క పల్లెటూరు "నాగంపాడు"కు సంబంధించిన సుబ్బయ్యపంతులూ, సంతకు చేరుకొన్నాడు. వడివడిగా నడచి రావటంవల్లనేమో, ఒళ్ళంతా తడి ముద్దయివున్నది. అతనికీ విజయనగరానికీ చాలా కాలపు పరిచయం వుంది. ఎక్కువగా వస్తూంటాడు. కాని విజయనగరం పౌరుల్లో అతనిమీద మంచి అభిప్రాయం కలిగినవారు ఎవరూలేరు. వృద్ధాప్యంలో వున్నాడు ఇప్పుడు. అంటే, సుమారు యాభైమించి వుంటయ్. అతనికి వయస్సు అంతే! జనసమ్మర్దంలోకి చొచ్చుకు రాబోతుంటే నేలమీదపడివున్న ఒక దారం ముక్క, సుబ్బయ్యపంతులు కళ్ళబడింది. లోభియైన అతని మనస్సులో అప్రయత్నంగా ఆ దారం ముక్క తనకు దేనికైనా పనికి రావచ్చనే వూహ మెదిలింది; వెంటనే ముందుకువంగి దాన్ని హస్తగతం చేసుకుందామనుకున్నాడు. చేత్తో తీసికొని, మెల్లిగాచుట్టి జేబులో వేసుకోబోతూండగా, తనవంక నిశితంగా చూస్తున్న వెంకయ్యపంతులును దుకాణం ద్వారందగ్గిర చూచాడు. గతంలో వారిద్దరిమధ్యా ఏదో తీవ్రంగా వివాదం జరిగింది. అందరికీ తెలుసు. ఇద్దరు ఒకర్నొకరు

పలకరించరు. ఇద్దరికీ సంతరించుకొనే మనస్తత్వాలుగావు.

తను చేయబోయిన కార్యాన్ని, తన పరమ శత్రువు చూడటంవల్ల కొంచెం కోపం, సిగ్గును, సుబ్బయ్యపంతులు పొందాడు. కాని, అప్రయత్నంగానే, అతనిచేతులు సుబ్బయ్యపంతులుకు తెలియకుండానే దొరికిన "ఆ మూల్యధనాన్ని" జేబులోకి నెట్టివేసాయ్; తన దొరకని వస్తువు వంక చూస్తున్నట్టు నటిస్తూ అక్కడ్నించి కదలి పోయాడు.

కిచుకిచుమనే ధ్వనుల్లో, ఏదో బేరాలాడుకుంటున్న వారు, మెల్లిగా నడుస్తున్న మనుష్యుల వెల్లువలో సుబ్బయ్యపంతులు, వెంకయ్యపంతులు దృష్టిపథంనుంచి బయటపడ్డాడు. ఆవులవంక కళ్లులెట్టి చూపిస్తున్నారు కొందరు. వెళ్ళిపోతున్నారు; మళ్లీ వస్తున్నారు. మనసుల్ని ఏ విధంగాను స్థిమితంలో వుంచుకోలేక. అమ్మకపు వారి ధరలకు విస్తుపోయి, 'అదెంత వెలెందుకయ్యా' అంటున్నారు ఫలానా పశువుకు ఫలానా చోట్ల తప్పు సుళ్ళున్నాయని, వాదిస్తున్నారు మరి కొందరు. కొందరు స్త్రీలు, కాళ్ళు బంధించబడివున్న కోళ్లు గల బుట్టలను క్రిందికు దించగా, అవి బయటికి గెంతుతూ, వింతగా కూస్తున్నయ్. వాటి కళ్ళల్లో భయం గోచరిస్తూంది.

కాసేపటికి సంతలోని జనం మెల్లగా పల్చబడసాగింది. గంట స్తంభం మధ్యాహ్నం పన్నెండు కొట్టగానే, చాలాదూరం వెళ్ళాల్సినవారు త్రుళ్ళిపడి సత్రవలను, హోటళ్ళను వెదుక్కుంటున్నారు.

నారాయణ విలాస్, భోజనంకొరకు వచ్చిన వారితో నిండివుంది. బయటి ఆవరణలో అన్ని రకరకాల బళ్లు వున్నాయ్-గుర్రపు జట్కాలు, రిక్షాలు, సైకిల్ రిక్షాలు-పక్కగదిలో నిండావున్న సలసల కాగే నూనెవాసన, ఘుమఘుమ మండే మంటల పొగా, బయటికి దూసుకు వస్తున్నయ్. కోడి, పావురాల మాంసముక్కలతో మూడు బొగవాణీలు పొయ్యిమీద కెక్కాయ్. కాలుతూ వుడుకుతూన్న మాంసం తాలూకు నోరూరే వాసన అక్కడున్నవారి వుత్సాహాన్ని ద్విగుణీకృతం చేస్తున్నది. నిజంగా ప్రతివాని నోటిలో నీరూరుతున్నది.

సంతకు వచ్చిన భూస్వాములూ- అక్కడ హాజరుగానే వున్నారు. పళ్ళాలు వస్తున్నయ్, తిరిగి తీసికెళ్ళబడుతున్నయ్ ఖాళీ అవగానే. ప్రస్తుతం వరిపంట ఎలాగున్నదని చర్చిస్తున్నారు. వాతావరణం, పైరుకు అనుకూలంగానే ఉన్నదట.

నారాయణ విలాస్ కెదురుగా, ఆకస్మికంగా ఏదో డప్పుమోతవినవచ్చింది. ఎవరో ఉత్సాహం నశించినవారు తప్పితే, అందరూ వెంటనే నిలబడి, ద్వారం కిటికీల చెంతకు వెళ్ళారు. చెప్పే దాన్ని ఆలకించే నిమిత్తమై.

డప్పు మోతను ఆపుచేసి, వెట్టివాడు ఆగిఆగి చెపుతూ అరుస్తున్నాడు బిగ్గరగా: విజయనగర వాసులకు మనవి చేయునది ,యేమనగా- కాస్పా మెయిన్‌రోడ్డుమీద, ఈ ఉదయం జరిగిన సంత వద్ద పది తొమ్మిది గంటల మధ్య ఎవో కొన్ని వ్యాపార సంబంధమైన పేపర్లు, ఐదు వందల రూపాయల కటికి రొక్కం వున్న ఒక నల్లటి తోలుసంచినీ రమణయ్యగారు పోగొట్టుకున్నారు గాన- అది ఎవరికన్నా కనబడినపక్షంలో దయచేసి టౌనుహాలు వారికి ఇవ్వ ప్రార్థన...ఓహో. ఓహో! వెట్టివాడట్లా డప్పు చేసుకుంటూ వెళ్ళిపోయాడక్కణ్ణించి. కాని వాడి హాలికేకలు, కొంచెం ధ్వని తగ్గినా, మళ్లీ అల్లంతదూరంలో వినవచ్చింది.

రమణయ్యగారు పోగొట్టుకొన్న డబ్బుగురించి పరిపరివిధాల సంభాషణ దొర్లిపోతూంది. భోజనం ముగించారందరూ. ఇంతలో ద్వారంవద్ద పోలీసు సార్జెంటు ప్రత్యక్షమయాడు ప్రతివారు ఆశ్చర్యం పొందారు. వారినుద్దేశించి- "ఇక్కడ సుబ్బయ్యపంతులనేవారెవరైనావున్నారా?" అన్నాడు.

బల్ల చివరన ఆసీనుడై, అప్పుడే ముగించబోతున్న భోజనం వదలిపెట్టాడు, ఆ మాటలకు తడబడి- సుబ్బయ్యపంతులు కాసేపటికి, "అవును- నేనే అతను" అని అనగల్గాడు.

"సుబ్బయ్యపంతులుగారూ! టౌను హాల్ కు నాతో కొంచెంవస్తారా? మేయర్ గారు మిమ్మల్ని అర్జెంటుగా తీసికొని రావాల్సిందన్నారు" వచ్చిన పనిని విన్నవించాడు, సార్జెంటు.

ఈ మాటలకు సుబ్బయ్యపంతులు మరింత త్రుళ్ళిపడ్డాడు. తనమీద ఏమన్నా అభాండం

గాని రుద్దబడిందా ఏమిటి? మేయర్‌కు తనతో పనేమిటబ్బా? ఏంతోచలేదు. సుబ్బయ్యపంతులు ఏమి సంగతని అడిగాడు సార్జెంటును. సార్జెంటు తనకేం తెలియదన్నాడు; విధిలేక, మెల్లిగా పోలీసు సార్జెంటుననుసరించాడు.

కుర్చీలో ఆసీనుడై, మేయర్ దేన్నిగురించో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అతడేస్థానికి విచారణ కర్త. లావుపాటి శరీరమతనిది. ఆడంబరమైన భాషంటే చెవిగోసుకుంటాడు.

“సుబ్బయ్యపంతులుగారూ, రమణయ్యగారు పోగొట్టుకున్న సంచిని మీరు తీసికొన్నట్టుగా మాకుగట్టిసాక్ష్యం దొరికింది. దానికి మీరేం చెప్పగలరు? దానికి మీరు ఒప్పుకోరూ?”

సుబ్బయ్యపంతులు దిగాలుబడి గుడ్లువప్పగించి చూడటందప్ప ఏంచేయలేదు. గుండెతీవ్రంగా కొట్టుకుంటున్నది. మాటలురాలేదు. పెదవులు వణికాయ్.

“నే - నా? సంచిని తీశానా?”

“అవును. మీరే.”

“లేదండి, దానిగురించి నాకేం తెలియదండీ”

“నీవాపని చేయగా ఎవరోగూడా చూస్తే అలా అంటావేమయ్యా?”

“ఎవరండీ ఆ చూచినవాళ్లు, ప్రతివాడికి నామీద ఈర్ష్య!”

“వెంకయ్య పంతులు-అదే ఆ గుడ్డలకొట్టుతను”

సుబ్బయ్యపంతులు అసలుసంగతి గ్రహించేడు. కోపంతో ముఖం కందగడ్డయింది. “వాడా చూసింది - ఆ మూర్ఖుడా. నాకుదొరికింది ఒక ముష్టి దారంముక్కండీ. దాన్ని తీసికొంటుండగానే వాడు చూసింది - అవును దారంముక్కే- చూడండి, ఇంకా” జేబులోదారంముక్క బయటికి తీశాడు.

కాని మేయర్ తలనడ్డంగా పంకించాడు. “నీవేమీ నాకన్ను గప్పలేవు. అంత కచ్చితమైన వెంకయ్యపంతులుగారే దారంముక్కను సంచిగా చేసికొంటారనేనా మీ వుద్దేశ్యం?” సుబ్బయ్య పంతులుకు ఏం పాలుపోవలేదు. మనసులో ఆందోళన పొందుతున్నది. భయవిహ్వలత తిరిగి ఆవహించింది. “ఇంతకూ, అంతకూ పైనవున్న ఆ భగవంతుడు నిర్ణయిస్తాడు, నిజమైన శిక్షార్హుణ్ణి!” అని లోపల కొంచెం సంతరించుకొన్నాడు.

మేయరింక ఇలా అన్నాడు “మీకది దొరకగానే ఇంకా దుమ్ములో కాసేపటిదాక వెతికారంటగదూ,ఒకవేళ ఇంకేమన్నా దొరకవచ్చని?”

“అయ్యో, రామ, ఎంత పచ్చి అబద్ధం, ఆ చెప్పినవాడు వట్టి మూర్ఖుడు, దుర్మార్గుడు. లేనిపోనివన్నీ కల్పించి చెప్పాడు... కావాలంటే, భగవంతుని ముందు ప్రమాణంచేసి, చెబుతున్నానండి, నాకేమీ తెలియదని. ఈ దారంముక్కే నాకు దొరికింది.”

అతని మాటలవల్ల ఏం లాభంలేక పోయింది. మేయరతన్ని విశ్వసించలేదు. ఏం చేయాలో మథనపడ్డా తెలియక, ప్రస్తుతం సుబ్బయ్య పంతుల్ని పంపించేశాడు.

జరిగిన విషయమంతటా పాకిపోయింది. టౌన్ హాల్ వదలగానే సుబ్బయ్యపంతు ల్నెందరో చుట్టూ తేనెటీగల్లాగ మూగి, సంగతేమని గుచ్చి గుచ్చి అడగసాగారు. దానికి వాళ్ళకు తన దారంముక్క కథను విన్నవించసాగాడు. ఎవరు నమ్ముతారుదానిని? అందరూ ఒక్కపెట్టున నవ్వి వూరుకున్నారు. తన నిర్దోషిత్వం, నిష్కపటత్వం తెలియపరచాలని వూహ. కాని ప్రతివాడు“పోరా! ముసలాడా!” అనసాగారు; అతని కథను విన్న వెంటనే ఆ మాట విన్నప్పుడల్లా అరికాలిమంట తల కెక్కుతున్న మాట వాస్తవమే. కాని ఏం చేయలేకపోతున్నాడు. వెధవది తన్ను ఒక్కడూ నమ్మటంలేదే.“ఆ సంచిగురించి నాకేం తెలియదు నాకు దొరికిందల్లా ఆ ఒక్క ముష్టిదారం ముక్కేనంటే, ఒక్కనవ్వు నవ్వుతారు ఎందుకు వీళ్ళు? సుబ్బయ్యపంతులకేం తోచటంలేదు. చీకటి పడిపోతూంది. ఇంటికి వెళ్ళాల్సిన సమయం. తన నిర్దోషత్వం వెల్లడయే నిమిత్తం ముగ్గురు నలుగురిని తనకు ఆదారం ముక్క దొరికినచోటుదగ్గరికి తీసికెళ్ళి చూపిస్తానన్నాడు. వాళ్లు ససేమిరా కదలక, పైగా వికృతంగా నవ్వుల కురిపించారు. ప్రపంచం అంతా అవిశ్వాసంతో, అధర్మంతో నిండివున్నదనిపించింది సుబ్బయ్యపంతులుకు.

సుబ్బయ్యపంతులు కారాత్రి నిద్రరాలేదు.

మర్నాడు ఒంటిగంటా సమయంలో, ఎవరో తను రమణయ్యగారు పోగొట్టుకున్న సంచి తనకు దొరికిందని తెచ్చి యిచ్చాడు. ఆ సంచిలో అన్ని వస్తువులూ బీరుపోకుండా వున్నయ్.

ఈ వార్తగూడ పలువురకూ వెంటనే తెలిసింది. సుబ్బయ్యపంతులు చెవిలో పడటానికి ఆలస్యం జరగలేదు. తక్షణం తన దారం ముక్క కథను వల్లించటం ప్రారంభించాడు. ఇపుడితని నోరసలు వూరుకోవటంలేదు.

"నేను చెప్పటంలేదండీ? అసలు నేనంత బాధపడింది, నామీద వచ్చి అభాండం రుద్దబడింది కనకనే. అబద్ధాలవల్ల, అభాండంవల్ల బాధపడటంకన్నా, దేనివల్లపడ్డా అంత ఇది అనిపించదు నాకు."

ఇదేవిషయాన్ని విస్తృతంచేసి, ఆ రోజల్లా ఎరుకపరుస్తూనేవున్నాడు; తనకు రోడ్డుమీద కనబడ్డ మిత్రునికల్లా, హోటల్లో కలిసినవాళ్ళకూ చెప్పేశాడు. అతని మనస్సు ప్రస్తుతం ప్రశాంతంగానేవున్నా, నెత్తిమీద పెద్ద బండ దిగిపోయినట్టుగానేవున్నా, అవ్యక్తమైన బాధ ప్రబలం కాసాగింది. క్రమంగా అందరిదృష్టికి హాస్యాస్పదంగా గోచరిస్తున్నాడు. తనువెనుకే, తన్నుగురించి ఏవో గుసగుసలాడుయయూ, వెకిలినవ్వులు నవ్వుతూ వుండటం తెలిసికొన్నాడు.

*     *     *

సుబ్బయ్య మరుసటి మంగళవారం మళ్ళా విజయనగరం సంతకు వచ్చాడు వెంగయ్యపంతులొకచోట కలిసి, చూడగానే పొట్ట చెక్కలయ్యేటట్టు తెగనవ్వాడు. ఎందుకో సుబ్బయ్యపంతుల కర్థంకాలేదు. తరువాత హోటల్లో తన్ను చూచే అందరూ నవ్వేదని తెలిసికొని, కోపం పట్టలేక వారి సమక్షంలో "ఏయ్, నన్నెందుకలా ఎగతాళి పట్టిస్తున్నారు- నేను తీశానా ఆ సంచిని? ఎవరో తను రమణయ్యగారికి తిరిగి ఇచ్చాడంట- అది తెలుసా?"

వారిలో ఒకరు ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"ఓ ముసలివాడా! వస్తువు దొరికినవాడెవడంటూ తిరిగి ఇచ్చేది. ఈ రోజుల్లో అనుమానం ఎవరిమీద అందరికీ వుందో, వారే తిరిగి ఇచ్చి వుండాలి. మాకందరికీ నిజం తెలుసులే"

సుబ్బయ్యపంతులు కలవరం చెందాడు. బాధ చెలరేగుతుంది మనస్సులో-చివరకి అవగాహనం అయింది. ఎవరో స్నేహితునిచే తనే తిరిగి ఆ సంచినిప్పించానని అందరూ అనుకొంటున్నారని తెలిసికొన్నాడు. తన నిర్దోషత్వాన్ని, హృదయవిదారక అమాయకత్వాన్ని ప్రదర్శించినా కొసకు లాభం శూన్యమైంది. ఎవరూ అతన్ని, మాటలను ఖాతరు చేసినట్టులేరు. పైగా వెకిలి నవ్వులు. ఆ వెకిలినవ్వులు తాకిడికి నిలబడలేక బయటికి నడిచాడు కోపంగా.

కోపంతో, అవమానంతో ఇంటికి వచ్చాడు సుబ్బయ్య పంతులు. ఆ నాటి తన దారంముక్క కొరకు ప్రదర్శించిన ఆశ వలనే ఇంతపనయిందని అనుకోలేదు. అసలు ఎందుకలా అనుకోవాలి? తన దారంముక్క కథను మళ్ళీ మళ్ళీ ఎత్తుతూనే వున్నాడు. మరీమరీ ప్రజలు అవిశ్వాసం చూపుతున్నారు.

"అబద్ధాన్ని సమర్థించేందుకు కుతంత్రం పన్నుతాడ్రా, ఎంత అఖండుడురా వీడు, ఈ ముసిలాడు! మనమేదో అనుకున్నాంగాని అన్నీ నచ్చిక బుచ్చికలే-" అని పరోక్షంలో అనినా పెద్దగా అవమానం పొందేవాడుకాదు. అంతమందిలో గేలిచేయడంచేత తల నెక్కడుంచాలో తెలియలేదు. ప్రతివాని దృష్టిలో తను అతిలోకువ,అపహాస్యం,అవమానం పొందుతున్నాడు. హృదయం చిల్లులు పడసాగింది; చిత్తం గాఢంగా గాయపడి నశించిపోతూంది. హృదయంలో శాంతి మనస్థయిర్యం, ఎప్పుడో జీర్ణించాయ్. తన అమాయకత్వం నిర్దోషిత్వంకొరకు చేసినవన్నీ వ్యర్థప్రయత్నాలే.

సుబ్బయ్యపంతులు డిసెంబరు మాసాంతంలో మంచానబడ్డాడు. జనవరి ప్రారంభంలో మరణించాడు. కాని, అవసానదశలోను తన నిష్కపటత్వం, అమాయికతను వెల్లడిచేయటానికి ప్రయత్నాలు మానలేదు.

"ఇంతకు మించహో నేనేం ఎరగను...చిన్న దారం ముక్క-"

(ఆధారం: ఫ్రెంచి కథ)